సాక్షి
నారాయణపేట
గురువారం । 22 । ఆగస్టు । 2024

గరిష్ఠం/కనిష్ఠం
34.4 /22.6

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

కనుమరుగు..!

జిల్లాలో మూతబడిన 38 ప్రభుత్వ పాఠశాలలు


మూతపడిన మద్దూరు మండలం భూనేడ్ ఉర్దూ మీడియం పాఠశాల

- పునఃప్రారంభానికి ఆసక్తి చూపని జిల్లా విద్యాశాఖ అధికారులు
- ప్రైవేటు బాటపట్టిన విద్యార్థులు

నారాయణపేట రూరల్: విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడం.. గ్రామీణ స్థాయిలో సరైన సౌకర్యాలు కల్పించకపోవడం.. ప్రభుత్వ ఉపాధ్యాయుల నామమాత్రపు విధులు.. ప్రైవేటు విద్యాసంస్థల నుంచి తీవ్ర పోటీ.. వీటి నేపథ్యంలో జిల్లాలోని దాదాపు 38 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కరువవడంతో చివరికి మూతపడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లోనూ నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తూ.. ఏటా రూ.లక్షలు ఖర్చుచేస్తుంది. ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ బోధనను ప్రారంభించింది. కానీ, క్షేత్రస్థాయికి వచ్చేసరికి ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు నగరాలను దాటి పట్టణాలు మండల కేంద్రాల్లో తమ బ్రాంచీలను ఏర్పాటు చేసి బస్సుల ద్వారా విద్యార్థులను తరలించుకొని పోతుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడం మరో కారణంగా చెప్పుకోవచ్చు. ఈ విద్యా సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా 38 పాఠశాలలు మూతపడగా.. వాటిని తెరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆయా పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదంలోకి నెట్టివేయబడ్డాయి.

ప్రైవేటు వైపు అడుగులు..

గతంలో ఉన్న గ్రామపంచాయతీలతోపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన గిరిజన తండాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కచ్చితంగా తెరవాలని ప్రభుత్వం ఆదేశించినా క్షేత్రస్థాయిలో అమలు జరగలేదు. గతంలో 20 మంది విద్యార్థులు ఉంటే పాఠశాలలు తెరవాలని నిబంధనను సవరించి ఒక్క విద్యార్థి ఉన్నా తప్పకుండా ఉపాధ్యాయుడిని కేటాయించి పాఠశాలను కొనసాగించాలని సూచించారు. అయినప్పటికీ ఆయా పాఠశాలలపై దృష్టి సారించిన పాపాన పోలేదు. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఆయా పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆయా గ్రామాల విద్యార్థులు ప్రైవేటుకు అడుగులు వేస్తున్నారు.

బడిబాట కూడా చేపట్టలే..

ఈ విద్యా సంవత్సరం జూన్ నెలలో చేపట్టిన బడిబాట కార్యక్రమం మూతపడిన పాఠశాలలో గ్రామాల్లో చేపట్టలేదు. కనీసం ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యాశాఖ అధికారులు విద్యాసంవత్సర ఆరంభంలో బడిబాట కార్యక్రమం నిర్వహించి విద్యార్థులను పోగుచేసి ఉంటే సగానికి పైగా పాఠశాలలు తెరుచుకునే అవకాశం ఉండేది. కానీ ఏ ఒక్క చోట సైతం బడిబాటకు అడుగులు వేయకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నమ్మకం లేక ప్రైవేటు వైపే దృష్టి సారించారు.

సీఎం నియోజకవర్గంలోనూ..

వాస్తవానికి జిల్లా వ్యాప్తంగా 38 పాఠశాలలు మూతపడగా అందులో సగం పాఠశాలలు కేవలం ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలంలో ఉన్నాయి. అందులో చాలావరకు గ్రామ పంచాయతీలు ఉన్నచోటే పాఠశాలలు మూతబడి ఉండడం గమనార్హం. గత విద్యా సంవత్సరంలో జనవరిలో నివేదిక సిద్ధం చేసి పంపించిన జిల్లా అధికారులు తిరిగి ఆయా పాఠశాలల పునఃప్రారంభంపై ఎలాంటి అడుగులు వేయలేదు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఆవాసానికి కిలోమీటర్ పరిధిలో ప్రాథమిక పాఠశాల ఉండాలి. గతంలో దాదాపు పాఠశాలలు అదే క్రమంలో ఉండగా వివిధ కారణాలతో ప్రస్తుతం మూతబడ్డాయి.

మూతబడిన బడులు ఇవే..

జిల్లా కేంద్రంలోని బాబాజీ మట్, శాంతినగర్, పల్లా బుజ్జార్, బురుడు వాడి, శాంతినగర్, శాతవాహన కాలనీ పేరుతో నడిచిన ప్రభుత్వ పాఠశాలలు ప్రస్తుతం విద్యార్థులు లేక మూతపడ్డాయి. ఎన్నో ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలు తరలిరావడంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ దీని ప్రభావం కనిపించింది. దామరగిద్ద మండలం అవుసలోనిపల్లి, సార్ల గడ్డ తండా, కృష్ణా మండలంలో ఎక్స్ రోడ్, కృష్ణ, వాసు నగర్, సుకూర్ లింగంపల్లిలోని పాఠశాలలు మూతపడ్డాయి. మాగనూరు మండలంలో అడవి ఖానాపూర్, ఎర్నాగస్ పల్లి, మరికల్ మండలంలో కన్మనూర్ (ఉర్దూ), ఊట్కూరు మండలంలో అమీన్పూర్ (ఉర్దూ) జీరాన్ హల్లి, నారాయణపేటలో నేమ్మలపల్లి, నక్క రామయ్య కాలనీ, మద్దూరు మండలంలో దానమ్మ తండా, కొమ్మూరు తండా, ఒడ్డు కింద తండా, బాపన్ కుంట తండా, పందిరి హనుమాన్లు, లక్ష్మీ నాయక్ తండా, తుపాకీ తండా, బాల్య నాయక్ తండాలోని పాఠశాలలు తెరుచుకోలేదు. గోకుల్ నగర్ తండా, నాయక్ తండా, పార్లకుంట తండా, నాయక్ తండా, దేనియా నాయక్ తండా, చాత్రా నాయక్ తండా, పల్లెగడ్డ, బీసీ కాలనీ, సాపను చేరువు తండా, ధర్మగణితండా, ఎర్రగోల్ తండా బూనీడు (ఉర్దూ మీడియం) పాఠశాలలు ఉన్నాయి. జీరో ఎన్రోల్మెంట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను గతంలో ఇతర పాఠశాలలకు డిప్యూటేషన్ పంపించగా ఇటీవల బదిలీల్లో వారు వారి పాఠశాలలకు వెళ్లిపోయారు. దీంతో ఆయా పాఠశాలలు మూతబడి శిథిలావస్థకు చేరుకున్నాయి.

విద్యార్థులు రాకపోవడంతోనే..



వాస్తవానికి విద్యార్థుల సంఖ్య లేక జిల్లాలో 38 పాఠశాలలు మూతపడ్డాయి. ఈ విద్యా సంవత్సరం పిల్లల రాక కోసం ప్రయత్నాలు చేయగా చాలావరకు విద్యార్థులు ప్రైవేటుకు వెళ్లడంతో ప్రభుత్వ పాఠశాలకు రాలేదు. ఒక్క విద్యార్థి వచ్చినా బడి తెరవాలని ఉద్దేశంతో ముందుకు వెళ్లాం. భవిష్యత్తులో ఆయా పాఠశాలలు తెరిచే విధంగా చర్యలు చేపడతాం.

– ఎండి అబ్దుల్ ఘని, డీఈఓ

న్యూస్‌రీల్

త్వరలో డిగ్రీ తరగతులు ప్రారంభిస్తాం

మద్దూరు: మద్దూరులో నూతనంగా ఏర్పాటైన డిగ్రీ కళాశాల తరగతులను త్వరలో ప్రారంభిస్తామని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో మండల ప్రజాప్రతినిధులు, పురప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జూనియర్ కళాశాలలోనే డిగ్రీ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన కనీస మౌళిక సదుపాయాలకు ప్రజాప్రతినిధులు, దాతలు సహకరించాలని కోరారు. బోధన సిబ్బందిని నియమించాలని కమిషనర్‌ను కోరామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాల గడువు పెంపు

నారాయణపేట రూరల్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు గడువు తేదీ పొడిగించినట్లు జిల్లా డీఐఈఓ సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులు 2024– 25 విద్యా సంవత్సరం ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరడానికి ఈనెల 31 వరకు గడువు ఉందని తెలిపారు.

నేడు, రేపు దోస్త్ ఇంట్రా కాలేజీ వెబ్ ఆప్షన్లు

నారాయణపేట రూరల్: దోస్త్ ద్వారా డిగ్రీ కళాశాలలో సీట్లు పొంది అదే కళాశాలలో గ్రూపు మారేందుకు నేటి నుంచి రెండు రోజులు ఇంట్రా కాలేజ్ రెండో విడత అవకాశం కల్పించినట్లు చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22, 23 తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని, 24న సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు.

డీఎంకు 15 వినతులు

నారాయణపేట రూరల్: జిల్లాలోని రెండు ఆర్టీసీ డిపోల పరిధిలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభించింది. మొత్తం 15 రకాల సమస్యలను ఫోన్ ద్వారా ఆర్టీసీ అధికారులకు విన్నవించగా వాటిలో 13 కోస్గి, రెండు నారాయణపేట డిపోకు చెందిన వినతులు వచ్చాయి. డిపో మేనేజర్ లక్ష్మిసుధ వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కోస్గి నుంచి వయా పల్లెర్ల ద్వారా మద్దూరు వరకు మధ్యాహ్నం బస్సులను నడిపించాలని కోరారు. కోస్గి నుంచి హైదరాబాద్‌కు బస్సుల సంఖ్య పెంచాలని, బస్సులు సమయపాలన పాటించాలని, బస్టాండ్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

నేరస్తులకు శిక్ష పడేలా చూడాలి

నారాయణపేట రూరల్: కేసుకు సంబంధించిన ప్రతి ఆధారాన్ని సంపాదించి, నేరస్తులకు కోర్టు ద్వారా తగిన శిక్ష పడే విధంగా చూడాలని డీఎస్పీ ఎన్.లింగయ్య సూచించారు. బుధవారం స్థానిక సబ్ డివిజన్ పోలీసు కార్యాలయంలో పేట, కోస్గి సర్కిల్ సీఐ, ఎస్‌లతో నేర సమీక్ష నిర్వహించారు. ప్రతి కేసును వేగంగా పరిష్కరించాలని, నేరాల కట్టడి, సైబర్ నేరాల బారిన పడకుండా యువత, గ్రామీణ ప్రజలకు తగిన అవగాహన కల్పించాలన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్

నారాయణపేట: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ జి.శ్రీనివాస్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని సింగారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏపీపీ సురేష్, అసిస్టెంట్ ఎల్ఈడి సి నాగేశ్వరి మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులే అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం జరిపి వారికి గౌరవం ఇవ్వాలని, సమాజానికి వయోవృద్ధులు చేసిన సేవలు పట్ల చర్చించుకోవాలని, ముందు కాలంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవని అప్పుడు అందరూ మనవాళ్లే అని ఒకరికొకరు సహాయం చేసుకునేవారన్నారు. ఏదైనా కుటుంబంలో సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫోన్ చేయడం వలన పరిష్కారం చూపుతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ ఆంజనేయులు, హాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాతీయ అంతరిక్ష వేడుకలు

నారాయణపేట రూరల్: గతేడాది ఆగస్టు 23న విక్రమ్ ల్యాండర్ ప్రజ్ఞాన్ రోవర్ జాబిల్లి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆ రోజుని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థులకు ఆ చారిత్రక ఘట్టాన్ని మరోమారు తిలకించే విధంగా ఏర్పాట్లు చేయాలని డీఈఓ ఎండి అబ్దుల్ ఘని ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, క్విజ్ పోటీలను నిర్వహించాలని, ఆయా పోటీలకు సంబంధించిన రిపోర్టును సంబంధిత మెయిల్ ద్వారా పంపించాలని, వివరాలకు డీఎస్ఓ భాను ప్రకాష్ నం.9440167947ను సంప్రదించాలని తెలిపారు.

అవినీతి ఖాకీలపై కొరడా

- ఇద్దరు సీఐలు.. మరో ఇద్దరు ఎస్సైలపై చర్యలు
- పేకాట రాయుళ్లకు పరోక్ష సహకారంలో ఎస్‌బీ సీఐ, ఇద్దరు ఎస్ఐల తొలగింపు
- మంత్రి జూపల్లి అడ్డగింతలో భద్రతా వైఫల్యంపై గద్వాల సీఐ ఐజీ ఆఫీస్‌కు అటాచ్


భీమ్‌కుమార్, సీఐ


జములప్ప, సీఐ


విక్రమ్, ఎస్సై


శ్రీనివాసులు, ఎస్సై

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/గద్వాల: శాంతి భద్రతల పర్యవేక్షణతో పాటు అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన ఖాకీలే అడ్డదారులు తొక్కుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా పలువురు పోలీసులు జూదరులకు పరోక్ష సహకారం అందిస్తున్నారు. అంతేకాదు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి పాలమూరులో పలు సంఘటనల నేపథ్యంలో దృష్టి సారించిన ఉన్నతాధికారులు అవినీతి ఖాకీలపై కొరడా ఝుళిపించారు. పేకాటకు సంబంధించి ఓ సీఐ, మరో ఇద్దరు ఎస్ఐలతో పాటు గద్వాలలో ఇటీవల మంత్రి జూపల్లి పర్యటనలో భద్రతా వైఫల్యంపై మరో సీఐపై వేటు వేస్తూ మల్టీ జోన్–2 ఐజీ వి.సత్యనారాయణ బుధవారం చర్యలకు ఉపక్రమించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఉండవెల్లి కేంద్రంగా పెద్ద ఎత్తున పేకాట దందా కొనసాగుతోంది. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు, గుంటూరు, అనంతపురం జిల్లాలకు చెందిన పేకాటరాయుళ్లు నిత్యం రూ.లక్షల్లో పేకాట ఆడుతుండగా.. దీన్ని అడ్డుకోవాల్సిన పోలీసు అధికారులు.. అక్రమార్కులతో చేతులు కలిపారు. నిత్యం పేకాట సజావుగా కొనసాగాలంటే మామూళ్లు ముట్టజెప్పాలని ఒప్పందం చేసుకున్నారు. దీంతో పేకాట రాయుళ్లకు అనధికారికంగా పోలీసు రక్షణ కల్పిస్తూ, అన్ని రకాల సపర్యాలు చేసి పెడుతున్నారు. ఈ దందా ఏడెనిమిది నెలలుగా కొనసాగుతున్నప్పటికీ.. విషయం బయటకు పొక్కకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే ఉండవెల్లి కేంద్రంగా పెద్ద ఎత్తున పేకాట కొనసాగుతున్న వ్యవహారాన్ని గద్వాలకు చెందిన ఓ ప్రజాప్రతినిధి లిఖిత పూర్వకంగా ఐజీకి ఫిర్యాదు చేయడం, మీడియా ద్వారా వెలుగు చూడటంతో ప్రత్యేక దృష్టి సారించిన ఉన్నతాధికారులు.. పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి పేకాట రాయుళ్లను పట్టుకున్నారు. అయితే ఈ వ్యవహారంలో రికవరీ చేసిన సొమ్మును కొంత నొక్కేశారని కొందరు పోలీసు అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఎస్పీ శ్రీనివాసరావు విచారణకు ఆదేశించారు. ఇందులో ఉండవెల్లి ఎస్‌బీ సీఐ జములప్ప, నవాబ్‌పేట ఎస్ఐ విక్రమ్, ఉండవెల్లి ఎస్ఐ శ్రీనివాసులు పాత్ర ఉన్నట్లు గుర్తించారు. ఇదే విషయాన్ని చర్యల నిమిత్తం నివేదికను ఐజీకి పంపగా.. సీఐ జములప్ప, ఎస్ఐలు విక్రమ్, శ్రీనివాసులుపై వేటు వేశారు. తక్షణమే వారిని విధుల నుంచి తొలగించి, ఐజీ ఆఫీసుకు అటాచ్ చేశారు. అనంతరం వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఐజీ సత్యానారాయణ స్పష్టం చేశారు.



గతంలోనూ ఆరోపణలు..

నవాబ్‌పేటలో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న విక్రమ్‌పై ఇది వరకే అవినీతి ఆరోపణలు ఉన్నాయి. గతంలో గద్వాల ట్రాఫిక్ ఎస్ఐ, సర్వ ఎస్ఐగా పని చేసిన ఆయన.. అవినీతికి పాల్పడి ఏసీబీ అధికారులకు దొరికాడు. అయితే కర్నూలు ప్రాంతానికి చెందిన పేకాట రాయుళ్లతో ముందస్తు ఒప్పందం మేరకు ప్రతినెలా రూ.లక్షల్లో మామూళ్లు వసూలు చేసి, జిల్లాలోని కొందరు ఉన్నతాధికారులకు ముట్టజెప్పుతూ జేబులు నింపుకొంటున్నారనే ప్రచారం ఉంది.

సీఐ భీమ్‌కుమార్‌పై వేటు..

ఈనెల 17వ తేదీన ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గద్వాలలో పర్యటించారు. ఈ క్రమంలో మంత్రిని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వర్గీయులు అడ్డుకుని రాళ్ల దాడి చేశారు. దీంతో మంత్రి పర్యటన ఉద్రిక్తంగా మారింది. దీన్ని సీరియస్‌గా తీసుకున్న మంత్రి.. విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పోలీసు బాస్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మంత్రికి భద్రత కల్పించడంలో వైఫల్యం చెందిన గద్వాల సీఐ భీమ్‌కుమార్‌పై వేటు వేస్తూ, ఐజీ ఆఫీసుకు అటాచ్‌మెంట్ చేశారు. అయితే దీనిపై డీఎస్పీ సత్యనారాయణ మాత్రం సీఐ సోదరుడికి అనారోగ్య సమస్యలతో ఆయన సెలవులపై వెళ్లారని.. ఇతర కారణాలు లేవని భిన్నమైన వివరణ ఇవ్వడం చర్చనీయాంశమైంది.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలి


మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: విలువలతో కూడిన బోధన జరగాలని... బడి అంటే బాధ్యత కాదని కుటుంబంగా భావించి నిబద్ధతతో పనిచేస్తారనే స్థానిక అభ్యర్థులను ఎంపిక చేశామని.. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేలా బోధించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని గురుకుల పాఠశాలలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు మెరిట్ ఆధారంగా ఎంపికైన అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఎక్కడా లేనివిధంగా జిల్లాకే ప్రత్యేకంగా నియమించిన అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ విద్యాశాఖలో గతేడాది సాధించిన ప్రగతి మరింత మెరుగ్గా నిర్వహించి, జిల్లాని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఫోనిక్స్ కార్యక్రమం, ఎఫ్ఎల్ఎన్, న్యాస్ సంసిద్ధత, క్లాస్ రూమ్ మేనేజ్‌మెంట్, చైల్డ్ సెంట్రిక్ టీచింగ్ టూల్స్‌పై విద్యాశాఖ వారి రిసోర్సు పర్సన్ శిక్షణ ఇచ్చారు. మా మీద పెట్టిన నమ్మకాన్ని నిలబెడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను తప్పనిసరిగా మెరుగుదల చేస్తామని శిక్షణ పాల్గొన్నవారు పేర్కొన్నారు. శిక్షణ తరగతి గదుల్లో మెరుగైన ప్రమాణాల సాధనకు చక్కని సోపానం కావాలని, వీరికి కావాల్సిన పూర్తి అకాడమిక్ సపోర్ట్ ఇవ్వాలని ఏఎంఓకు కలెక్టర్ సూచించారు. జిల్లాలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. శిక్షణలో డీఈఓ అబ్దుల్ ఘని, ఏఎంఓ విద్యాసాగర్ రిసోర్సు శిక్షకులు పాల్గొన్నారు.

మహిళా ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం


నర్వలో మహిళలతో మాట్లాడుతున్న ఢిల్లీకి చెందిన బ్రాక్ సంస్థ ప్రతినిధులు

నర్వ: ఢిల్లీ నుంచి బీఆర్ఏసీ(బ్రాక్) సంస్థ ఆధ్వర్యంలో నర్వ మండలంలో మహిళల ఆర్థిక స్థితిగతులపై రెండు రోజుల పాటు అధ్యయనం కొనసాగుతుందని అడిషనల్ డీఆర్డీఓ అంజయ్య, ఏపీఎం చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం పాథర్చేడ్, నర్వ మండల కేంద్రంలోని మహిళా సంఘాల సభ్యులతో బ్రాక్ సంస్థ మహిళా ప్రతినిధులు ఉషారాణి, జనని సమావేశమయ్యారు. ఆయా గ్రామాల్లో మహిళా సంఘం సభ్యులు, జోగినుల జీవనం, వారి ఆర్థిక పరిస్థితులు, నేటికి బాల్యవివాహాలు చోటుచేసుకోవడంపై ఆరా తీశారు. అనంతరం స్త్రీశిశు సంక్షేమ శాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆర్థికంగా నిలదొక్కుకున్న మహిళా సంఘాల ఆదర్శనీయత, నేటికి మెరుగైన వాటి స్థితిగతుల వాస్తవ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రెండో రోజు మిగిలిన గ్రామాల్లో ఈ పర్యటన కొనసాగుతుందని పేర్కొన్నారు. పర్యటనలో డీపీఎం రామునాయక్, ఏపీఎం చంద్రశేఖర్, సీసీలు మహాదేవప్ప, అంజప్ప, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఆయా గ్రామస్థులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో బదిలీలు


ఏనుగొండ కేజీబీవీలో విద్యార్థులకు బోధిస్తున్న పీజీసీఆర్టీ ఉపాధ్యాయురాలు (ఫైల్)

నేటినుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

- జిల్లాలో సాధారణంగా.. ఇతర జిల్లాలకు పరస్పర బదిలీలకు అవకాశం
- విద్యార్థుల మార్కుల ఆధారంగా టీచర్లకు పాయింట్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియను పూర్తిచేసిన ప్రభుత్వం.. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ సిబ్బంది బదిలీలకు అనుమతిచ్చింది. నాలుగేళ్ల క్రితం కేవలం జిల్లా పరిధిలో మాత్రమే స్థానచలనం పొందిన కేజీబీవీ సిబ్బంది.. తాజాగా రాష్ట్రంలో ఎక్కడికైనా మ్యూచువల్ పద్ధతిలో బదిలీ అయ్యేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 76 కేజీబీవీలు ఉండగా.. 680 మంది పనిచేస్తున్నారు. వీరిలో 68 మంది గతేడాది నియమితులయ్యారు. రెండేళ్ల సర్వీస్ పూర్తయిన వారు మాత్రమే బదిలీకి అర్హులుగా నిర్ణయించారు. ఈ మేరకు గురువారం నుంచి సీఆర్టీలు, పీజీసీఆర్టీలు, ఏఎన్ఎంలు, అకౌంటెంట్‌లు, పీఈటీల బదిలీ ప్రక్రియ చేపట్టనున్నారు. అర్హులైన వారు పూర్తి వివరాలతో www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

రాష్ట్రంలో ఎక్కడికైనా..

సాధారణంగా బదిలీలు కేవలం జిల్లా పరిధిలో మాత్రమే నిర్వహిస్తారు. లేదా ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహిస్తారు. అయితే పరస్పర బదిలీలతో రాష్ట్రంలోని ఏ జిల్లాకు అయినా స్థానచలనం పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. జిల్లా నుంచి ఒక సబ్జెక్టు ఉపాధ్యాయురాలు ఇతర జిల్లాకు బదిలీపై వెళ్తే.. అదే సబ్జెక్టు టీచర్ సంబంధిత జిల్లా నుంచి ఇక్కడికి రావాల్సి ఉంటుంది. వీటితో పాటు స్పౌజ్, దివ్యాంగులు, వితంతు, అనారోగ్యంతో బాధపడే వారికి ప్రాధాన్యత క్రమంలో పాయింట్లు కేటాయించనున్నారు.

మార్కుల ఆధారంగా పాయింట్లు..

గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్‌లో సబ్జెక్టుల వారీగా విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా ఉపాధ్యాయులకు పాయింట్లు కేటాయించనున్నారు. సీఆర్టీ, స్పెషల్ ఆఫీసర్లకు ఎస్ఎస్‌సీలో 10/10 జీపీఏ సాధిస్తే ఒక్క పాయింట్, 9 జీపీఏకు 0.5, 8 జీపీఏకు 0.25 పాయింట్లు కలపనున్నారు. పీజీ సీఆర్టీ, స్పెషల్ ఆఫీసర్లకు సంబంధించి విద్యార్థికి 90 శాతం పైగా మార్కులు వస్తే 3పాయింట్లు, 80 నుంచి 90 శాతం మార్కులు వస్తే 2 పాయింట్లు ఇవ్వనున్నారు. పీజీ సీఆర్టీకి విద్యార్థి ఎంసెట్‌లో 15 వేలకు పైగా ర్యాంకు వస్తే ఒక పాయింట్, 25 వేల నుంచి 35వేల ర్యాంక్ వస్తే 0.5 పాయింట్లు కేటాయిస్తారు.

బదిలీల ప్రక్రియ ఇలా..

అభ్యర్థులు ఈ నెల 22, 23 తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 24న కేజీబీవీల్లో ఎస్ఓలు దరఖాస్తుల ఫారాలు స్వీకరిస్తారు. 25న ఉపాధ్యాయుల పాయింట్లకు సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. 26న అభ్యంతరాలను స్వీకరిస్తారు. 27న డీఈఓ ఆధ్వర్యంలో అభ్యంతరాల పరిశీలించి, 29న తుది జాబితాను ప్రకటిస్తారు. 30న జిల్లా పరిధిలో బదిలీ అయ్యే వారికి ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పిస్తారు. సెప్టెంబర్ 1న ఇంటర్ డిస్ట్రిక్ట్ బదిలీలకు సంబంధించిన ఖాళీలను ప్రదర్శిస్తారు. 2న ఇంటర్ డిస్ట్రిక్ట్‌కు సంబంధించి వెబ్ ఆప్షన్ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. 4, 5 తేదీల్లో బదిలీల ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

పారదర్శకంగా నిర్వహిస్తాం..



కేజీబీవీల్లో పనిచేస్తున్న సీఆర్టీ, పీజీసీఆర్టీ, ఏఎన్ఎం, అకౌంటెంట్, ఎస్ఓల బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గురువారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తాం. నిర్దేశిత తేదీల్లో బదిలీల ప్రక్రియ కొనసాగుతుంది. పారదర్శకంగా బదిలీల ప్రక్రియ నిర్వహిస్తాం.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి


కొటకొండ బ్యాంక్ మేనేజర్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతులు

నారాయణపేట/ నారాయణపేట రూరల్/మక్తల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి రైతుకు రూ.రెండు లక్షల రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు, భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అసంబద్ధ నిబంధనలపై నిరసన వ్యక్తం చేస్తూ బుధవారం నారాయణపేట, మండలంలోని కోటకొండ, మక్తల్‌లో రైతులు ధర్నా నిర్వహించారు. ముందుగా జిల్లా కేంద్రంలో భారతీయ కిసాన్ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సత్యనారాయణ చౌరస్తా నుంచి రైతులతో కలిసి ర్యాలీ చేపట్టి రైతు రుణమాఫీని రైతులందరికి చేయాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. రేషన్ కార్డ్ నిబంధన, ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ వెంటనే... అమలు చేయాలని, రైతు భరోసా వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. వెంకటేష్, అనంతరెడ్డి, ప్రతాపరెడ్డి, శీను, మహిపాల్ పాల్గొన్నారు.

మక్తల్, కోటకొండలో

నారాయణపేట మండలం కోటకొండ, మక్తల్‌ల బ్యాంకు ఎదుట అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు ధర్నా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేయకుండా ఎన్నికల సందర్భంగా ప్రకటించిన విధంగా ఏ ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణ మాఫీ చేసి నేరుగా వారి ఖాతాలలో జమ చేయాలన్నారు. విజయలక్ష్మి, కాశీనాథ్, చెన్నారెడ్డి, నారాయణ, గోపాలం, భగవంతు, కిరణ్, భుటో, భాస్కర్, సంజీవ్, బాలకృష్ణ, శివ, బాలకృష్ణ, నరసింహ, కెంచె నారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దుస్తులు ఉతికేందుకు వెళ్లి.. వాగులో పడి మహిళ మృతి

మాగనూర్: దుస్తులు ఉతికేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని అమ్మపల్లికి చెందిన గుడిసె నర్సమ్మ(55) మంగళవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో గల పెద్దవాగులో దుస్తు ఉతికేందుకు వెళ్లింది. కాగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయింది. అయితే కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆమె జాడ కోసం రాత్రి మొత్తం వాగులో వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం తెల్లవారుజామున పర్మన్‌దొడ్డి శివారు వాగులో నర్సమ్మ మృతి చెంది ఉండడాన్ని గమనించిన గ్రామస్తులు మృతిదేహాన్ని బయటకు తీశారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


విష్ణు గౌడ్(ఫైల్)

అమరచింత: తాగుడుకు బానిసైన వ్యక్తి తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సింగంపేటలో బుధవారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన విష్ణుగౌడ్(36) కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలోనే ఇంట్లో గొడవలు జరిగిన ప్రతిసారి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు పాల్పడుతూ.. ఆత్మహత్యాయత్నానికి పాల్పడేవాడు. బుధవారం మధ్యాహ్నం అతను వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఇది గమనించిన సమీప రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య భార్గవితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


సువర్ణ (ఫైల్)

వనపర్తి రూరల్: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతిచెందిన ఘటన పెబ్బేరు మండలం కొత్త సూగూరు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. కొత్త సూగూరుకు చెందిన ముంత సువర్ణ (39) ఇంటి మెట్ల వద్ద ఇనుప చువ్వకు కట్టేసిన గొర్రెపిల్లను విడుస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. విద్యుత్ స్తంభం నుంచి సర్వీస్ వైర్‌తో పాటు ఉండే ఇనుప తీగను ఇంటి పైకప్పుపై ఇనుప చువ్వకు కట్టడంతోనే కరెంటు సరఫరా అయి ఉంటుందని మృతురాలి భర్త ముంత రాజు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కలుషిత జలాలతో నిండిన పల్లె చెరువు


రాజాపూర్: మండలంలోని ముదిరెడ్డిపల్లి శివారులో ఉన్న పల్లె చెరువు బుధవారం కురిసిన ఓ మోస్తరు వర్షానికి తోడు.. సెజ్‌లోని పరిశ్రమలు వదిలిన కాలుష్యపు నీటితో నిండింది. ఈ వర్షాకాలంలో చెరువులు నిండేంత వర్షాలు కురవకున్నా.. కాలుష్యపు జలాలు రావడం వల్లే చెరువు నిండే స్థితి వచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కలుషిత నీటి వల్ల చెరువులో చేపలు మృతి చెందుతున్నాయని వాపోయారు. కొన్నేళ్లుగా కలెక్టర్‌కు, పీసీబీ అధికారులకు ఫిర్యాదులు కూడా చేసినట్లు పేర్కొంటున్నారు.



జూరాలకు మళ్లీ వరద

5 క్రస్టు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

- ప్రాజెక్టుకు 57,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి


జూరాల వద్ద దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరగడంతో ప్రాజెక్టు 5 క్రస్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రానికి 57, 500 క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పెరిగినట్లు పేర్కొన్నారు. గేట్ల ద్వారా 20,760, విద్యుదుత్పత్తి నిమిత్తం 39,442, ఆవిరి రూపంలో 92, నెట్టెంపాడుకు 750, కుడి కాలువ ద్వారా 645, ఎడమ కాలువకు 550, కోయిల్‌సాగర్‌కు 315, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 75 క్యూసెక్కులు ఇలా.. ప్రాజెక్టు నుంచి మొత్తం 62,264 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.296 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు. ఇదిలా ఉండగా.. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గినట్లు అధికారులు చెప్పారు. ప్రాజెక్టుకు 25,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. 3 గేట్ల ద్వారా 12,260 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 33.313 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 33.98 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు.

జోరుగా విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాలప్రాజెక్టు దిగువ, ఎగువ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతోంది. కాగా బుధవారం 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్లద్వారా 195 మెగావాట్లు, 90.160 ఎం.యూ., దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 66.440 ఎం.యూ. విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఇప్పటివరకు 147.295 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని అధికారులు వివరించారు.

శ్రీశైలంలో నీటిమట్టం 882.5 అడుగులు.

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం నాటికి నీటిమట్టం 882.5 అడుగుల వద్ద 201.5822 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 20,760 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 39,442, సుంకేసుల నుంచి 92,652 మొత్తం 1,53,104 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో శ్రీశైలం జలాశయానికి వస్తోంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,882 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. గత 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 30,000 క్యూసెక్కులు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,410 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 13.681 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. స్థానికంగా 142.00 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

సుంకేసులకు పెరిగిన ఇన్‌ఫ్లో

- 21 గేట్లు ఎత్తివేత

రాజోళి: సుంకేసులకు ఎగువ నుంచి భారీగా ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో అధికారులు బుధవారం 21 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఎగువ నుంచి 95,110 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా..92,652 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలంనకు వదిలి, కేసీ కెనాల్ కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ రాజు వివరించారు.


సుంకేసుల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

గొర్రెల సబ్సిడీ రుణాలలో అక్రమాలు?


బ్యాంక్ నుంచి వచ్చిన నోటీసులను చూపుతున్న కోమటికుంటకు చెందిన బాధితులు

- లబ్ధిదారులకు తెలియకుండా రూ.22లక్షల మేర స్వాహా
- ఆలస్యంగా వెలుగు చూసిన వైనం

లింగాల: లబ్ధిదారులకు తెలియకుండానే వారి పేరిట యాదవ సంఘం పెద్దలు బ్యాంకులో ఎల్బీ రుణాలు తీసుకున్నఘటన బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని కోమటికుంటలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితులు తమకు జరిగిన మోసాన్ని ఏకరువు పెట్టారు. కోమటికుంటకు చెందిన పలువురు గొల్ల కురుమల పేరిట 2017లో ఏపీజీవీబీ మహబూబ్‌నగర్ బ్రాంచ్‌లో 22 మంది పేరిట అప్పటి యాదవ సంఘం అధ్యక్షుడు సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేయించారు. లబ్ధిదారులు ఈ రుణాల విషయం ఏమాత్రం తెలియదు. సంఘం సభ్యత్వం గురించి సంతకాలు చేశామని, రుణాల గురించి తమకు తెలియదని లబ్ధిదారులు తెలిపారు. తీసుకున్న రుణాలను చెల్లించాలని జూన్ నెలలో బ్యాంకు నుంచి నోటీసులు రాగా మోసపోయినట్లు గుర్తించారు. ఒక్కొక్కరు రూ.1.60 లక్షలను చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. రుణాలకు సంబంధించి భూములను మార్టిగేజ్ చేయించారని, ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో గతంలో బాధితులు కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. విచారణ కూడా జరిపించారు. ఇదిలా ఉండగా తమకు అప్పట్లో రూ.90 వేలు ముట్టినట్లు కొంతమంది బాధితులు తెలిపారు. అయితే ప్రభుత్వం రుణాలను మాఫీ చేస్తుందనే నమ్మకంతో ఏడేళ్ల నుంచి ఎదురు చూడగా రుణమాఫీ కాకపోవడంతో లబ్ధిదారులు వడ్డీతో కలిపి రుణ భారం పెరిగినట్లు తెలుస్తుంది. ఇందులో తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడ లేదని, మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారికి రుణాలను ఇప్పించడం జరిగిందని యాదవ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్ తెలిపారు. కోమటికుంటలో చాలా వరకు మంజూరైన రుణాలను ఇచ్చినట్లు, కొంతమందికి ఇవ్వాల్సి ఉందని, తనపై ఉద్దేశ పూర్వకంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆయన వివరణ ఇచ్చారు.

పాముకాటుతో బాలుడు మృతి

ఎర్రవల్లి: పాముకాటుకు గురై చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. గోపల్‌దిన్నెకు చెందిన బోయ వేణుగోపాల్ (9) మంగళవారం రాత్రి తమ గుడిసెలో నిద్రిస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గద్వాలకు తరలించారు. వైద్యుల సూచన మేరకు కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ వేణుగోపాల్ బుధవారం మృతి చెందాడు. అతడి తండ్రి బోయ బజారి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

రైలు నుంచి కిందపడి..

మానవపాడు: రైలు నుంచి కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మానవపాడు శివారు ప్రాంతంలో బుధవారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా.. గుర్తు తెలియని వ్యక్తి(45) రైలులో ప్రయాణం చేస్తూ.. 212/14 మానవపాడు రైల్వే స్టేషన్ మధ్యలో ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. తల వెనుక భాగంలో తీవ్ర గాయాలై మృతిచెందాడు. శరీరంపై తెల్లని ఫుల్‌షర్టు, నీలిరంగు ఫుల్‌డ్రాయర్ ఉన్నాయి. షర్టు జేబు వద్ద డీటీ అని టైలర్ మార్కు ఉంది. కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలియజేశారు.

చదివే సబ్జెక్టుపై ఆసక్తి అవసరం


మాట్లాడుతున్న సివిల్స్ ర్యాంకర్ అనన్యరెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు చదివే సబ్జెక్టుపై పూర్తిస్థాయిలో ఆసక్తి ఉండాల్సిన అవసరం ఉందని సివిల్స్ ర్యాంకర్ అనన్యరెడ్డి అన్నారు. స్థానిక జయప్రకాశ్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటుచేసిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సివిల్స్ శిక్షణలో అధ్యాపకుల సలహాలు, సూచనలు పాటించి అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసుకున్నట్లు చెప్పారు. గతంలో సివిల్స్ సాధించిన సీనియర్ల సూచనలు, సలహాలు కూడా ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. అనంతరం కళాశాల చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు కళాశాల స్థాయిలో కష్టపడి చదివితే జీవితాంతం సుఖంగా ఉండవచ్చన్నారు. జిల్లాకు సివిల్స్ ర్యాంకర్ అనన్యరెడ్డిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అనన్యరెడ్డికి జైపాల్‌రెడ్డి స్మారక స్ఫూర్తి అవార్డుతో పాటు రూ. 25 వేలు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటరామారావు, ప్రిన్సిపాల్ సుజీవన్, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు


జిల్లా బాలుర జట్టుతో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బుధవారం జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ యూత్ బాలబాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని స్టేడియంలో 5వ రాష్ట్రస్థాయి యూత్ అండర్-16 అంతర్‌జిల్లా బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నసరుల్లా హైదర్, కోచ్ ఎండీ ఖలీల్, మీర్ ఖాలెద్ అలీ, మహ్మద్ ఇలియాజ్, సుబాన్‌జీ, మహ్మద్ షోయబ్ పాల్గొన్నారు.

జట్ల వివరాలు..

బాలుర జట్టుకు ప్రణయ్, కె.అనిల్, రాంచరణ్, శస్వాత్, మహ్మద్ అతిఫ్, ఎం.యశ్వంత్, ఎస్.ఆదిత్, రాజారాం, సాయికృష్ణ, ద్రోణదత్తా, మహ్మద్ అయాజ్, లోకేష్, ఎస్‌ఎస్‌వీ ప్రణీత్, షేక్ మహిత్, మహ్మద్ సిరాజ్, సదానంద ఎంపికయ్యారు. బాలికల జట్టుకు హర్షిత, నిఖిత, వైష్ణవి, చైత్ర, మేఘన, శ్రీజ, పవిత్ర, రాజేశ్వరి, స్నిగ్ధా, నషర ఫాతిమా, టి.సమన్వవి, జి.కావ్య, హిమానయ, సహస్ర, దీక్ష, వరలక్ష్మి ఎంపికైనట్లు తెలిపారు.

బాలిక గొంతు కోసిన గుర్తు తెలియని వ్యక్తి

- తప్పిన ప్రమాదం.. నిందితుడి కోసం పోలీసుల గాలింపు


చికిత్స పొందుతున్న సిరి

మహబూబ్‌నగర్ క్రైం: ఇంటి ఎదుట ఆడుకుంటున్న ఓ బాలికను గుర్తు తెలియని వ్యక్తి పదునైనా ఆయుధంతో గొంతు కోసి వెళ్లాడు. మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని శ్రీనివాస కాలనీకి చెందిన జి.సిరి బుధవారం సాయంత్రం శ్రీనివాస కాలనీ పార్క్‌లో తోటి పిల్లలతో కలిసి కాసేపు ఆడుకుని..7 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో ఇంటి ముందు ఉన్న పాపను గుర్తు తెలియని వ్యక్తి వాహనంపై వచ్చి పదునైనా ఆయుధంతో గొంతు కోసి వెళ్లాడు. రక్తంతో ఇంట్లోకి వెళ్లిన పాపను గమనించిన తల్లి వెంటనే చికిత్స కోసం ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. దీంతో పాపకు గొంతు భాగంలో సర్జరీ చేసి కుట్లు వేశారు. గొంతు దగ్గర లోతుగా తెగక పోవడంతో ప్రమాదం తప్పిందని వైద్యులు తెలిపారు. నిందితుడి కోసం స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

ఘాటు తగ్గని ఉల్లి

దేవరకద్ర: మార్కెట్‌లో ఉల్లి ధర ఏమాత్రం తగ్గడం లేదు. బుధవారం దేవరకద్ర మార్కెట్‌కు దాదాపు 200 బస్తాల ఉల్లి అమ్మకానికి రాగా.. వ్యాపారులు వేలం ద్వారా కొనుగోలు చేశారు. క్వింటాల్ ఉల్లి గరిష్ఠంగా రూ. 4,030, కనిష్ఠంగా రూ. 3,760 ధరలు పలికాయి. 45 కిలోల ఉల్లి బస్తా గరిష్ఠంగా రూ. 2000, కనిష్ఠంగా రూ. 1,900 వరకు విక్రయించారు. చిన్న సైజులో ఉన్న ఉల్లి క్వింటాల్ ధర రూ. 2 వేల వరకు పలికింది.


దేవరకద్ర మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన ఉల్లిగడ్డ

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో చోరీ

అలంపూర్: బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో చోరీ జరిగింది. ఈ ఘటన అలంపూర్ చౌరస్తాలో బుధవారం వెలుగుచూసింది. బాధితుల వివరాల మేరకు.. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ఎన్ఎల్ 01బీ 3535 నంబర్ గల ప్రైవేటు ట్రావెల్స్ బస్సు మంగళవారం రాత్రి 7:30 గంటల సమయంలో 28 మంది ప్రయాణికులతో బయల్దేరింది. బస్సులో ప్రయాణిస్తున్న వారిలో 23 మంది ఆన్‌లైన్‌లో, మరో 5 మంది సాధారణంగానే బస్సు ఎక్కి టికెట్ తీసుకున్నారు. అర్ధరాత్రి 12 సమయంలో కర్ణాటక రాష్ట్రం బాజేపల్లి వద్ద బస్సు ఆపడంతో ప్రయాణికులు భోజనం చేశారు. బుధవారం తెల్లవారుజామున తెలంగాణ రాష్ట్ర సరిహద్దు పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద బస్సు ఆపడంతో ప్రయాణికులు వాష్‌రూంకు వెళ్లి వచ్చారు. తిరిగి బస్సు బయల్దేరిన క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ప్రయాణికురాలు ఆశ తన బ్యాగ్‌లో ఉన్న 14 తులాల బంగారం ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలియజేసింది. అదే సమయంలో ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి చెందిన రూ. 80 వేల విలువ గల ల్యాప్‌టాప్ సైతం చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో అలంపూర్ చౌరస్తాలో బస్సును నిలిపివేసి, ప్రయాణికులను తనిఖీ చేశారు. ఎవరి వద్ద వస్తువులు లభించక పోవడంతో ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఆశ ఫిర్యాదు చేశారు. సీఐ రవిబాబు, ఎస్‌ఐ శ్రీనివాసులు బస్సు వద్దకు చేరుకొని ప్రయాణికులను విచారించారు. కర్ణాటక రాష్ట్రంలోని బాజేపల్లి వద్ద భోజనం కోసం నిలిపిన సమయంలో చోరీ జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసు బృందాలు ఏపీకి వెళ్లి ఈ ఘటనపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

616 కిలోల బెల్లం పట్టివేత



కొల్లాపూర్: సారా తయారీ కోసం కొల్లాపూర్‌కు తీసుకొస్తున్న 616 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి తెలిపారు. హైదరాబాద్ నుంచి బంగారయ్య ట్రాన్స్‌పోర్ట్ ద్వారా బెల్లం రవాణా జరుగుతుందనే ముందస్తు సమాచారంతో బుధవారం కొల్లాపూర్‌లో తనిఖీలు చేపట్టామన్నారు. టీఎస్ 31టీ 2806 నంబర్ డీసీఎంలో బెల్లాన్ని గుర్తించామన్నారు. బెల్లాన్ని స్వాధీనం చేసుకొని డీసీఎంను ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజ్యలక్ష్మి, ఎస్‌ఐలు హనుమంతు, అరుణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

5న కురుమూర్తి జాతరకు టెండర్లు

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలో వెలసిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో అంగరంగ వైభవంగా కొనసాగుతాయి. ఉత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. భక్తులకు టెంకాయలు, లడ్డూ ప్రసాదం, పూజా సామగ్రి విక్రయించేందుకు, తలనీలాల సేకరణ, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు గాను సెప్టెంబర్ 5వ తేదీన కురుమూర్తి స్వామి దేవస్థానం కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు.

డ్రగ్స్, పోర్న్ వీడియోలను నిషేధించాలి

- మెడికో విద్యార్థిని అత్యాచారం కేసులో నిందితులను శిక్షించాలి
- చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ శ్రీదేవి డిమాండ్


మాట్లాడుతున్న చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ శ్రీదేవి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: డ్రగ్స్, పోర్న్ వీడియోలను తక్షణమే నిషేధించాలని చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ శ్రీదేవి డిమాండ్ చేశారు. కోల్‌కతాలో మెడికో విద్యార్థిని అత్యాచారం, హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ ఘటనను అందరూ ఖండించాలన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో మద్యం, డ్రగ్స్ విచ్చలవిడిగా అమ్మకాలు సాగడం వల్లే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఎంతో మంది అమ్మాయిలు సైతం అదృశ్యమయ్యారని పేర్కొన్నారు. మద్యం మత్తులో బాలికలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు. వీటిని నివారించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సృజన, శాంత, నర్మద, రాములమ్మ, మన్యం, వెంకటయ్య, ఖలీల్, చక్రవర్తి, బాబుల్‌రెడ్డి, ప్రవీణ్, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులు హేయనీయం



స్టేషన్ మహబూబ్‌నగర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు హేయమైన చర్య అని ప్రముఖ వక్త ఆవునూరి సాయికృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం రాత్రి జరిగిన మేధావుల సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. బంగ్లాదేశ్‌లో ఒకప్పుడు 30 శాతం ఉన్న హిందువుల జనాభా ప్రస్తుతం 8 శాతానికి పడిపోయిందన్నారు. అక్కడ అనేక దేవాలయాలు కనుమరుగయ్యాయని అన్నారు. రాజకీయ కోణంలో చూస్తే ఇది ఒక రిజర్వేషన్ అంశానికి సంబంధించిన విషయం కాదన్నారు. హిందువులపై జరుగుతున్న దాడులపై మేధావులు స్పందించకపోతే, దేశానికి ఘోరమైన పరిస్థితులు వచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో న్యాయవాది నిహారికారెడ్డి, డా. భరద్వాజ్, ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.